ఈనాడు
epaper.eenadu.net

# మహిళా విద్యా సాధికారత

> 'ఈ ప్రపంచాన్ని మార్చడానికి విద్యకు మించిన ఆయుధం లేదు' అన్నారు దక్షిణాఫ్రికా జాతిపిత నెల్సన్ మండేలా. ఏ సమాజమైనా సమగ్రాభివృద్ధి దిశగా అడుగులు వేయడానికి చదువే కీలకం.

చదువులకు పెద్దపీట వేస్తున్న తెలంగాణ ప్రభుత్వం- గురుకుల విద్యాసంస్థల ద్వారా ప్రాథమిక స్థాయి నుంచే పూర్తిగా ఉచిత విద్యను అందిస్తోంది. బాలికలు, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ వర్గాల పిల్లల కోసం దేశంలోనే ఎక్కడా లేని విధంగా గురుకుల పాఠశాలలు, కళాశాలలను ఏర్పాటు చేసింది. రాష్ట్ర ఆవిర్భావం తరవాత వెయ్యికి పైగా నూతన గురుకుల పాఠశాలలను నెలకొల్పింది. ముఖ్యమంత్రి కేసీఆర్ దార్శనికత వల్ల గడచిన తొమ్మిదేళ్లలో 86 గురుకుల కళాశాలలు అంకురించాయి. దాంతో మరింత మందికి యూజీ, పీజీ కోర్సులు అందుబాటులోకి వచ్చాయి. ఔషధ, న్యాయ కళాశాలలు సైతం విరివిగా ఏర్పాటయ్యాయి. మహిళల ఉన్నతవిద్య కోసం రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక విశ్వవిద్యాలయాన్ని నెలకొల్పింది.



## ఎంతో మార్పు...

రాష్ట్ర ఆవిర్భావానికి ముందు తెలంగాణ ప్రాంతంలో 16 ప్రభుత్వ డిగ్రీ కాలేజీలకు మాత్రమే జాతీయ మదింపు, గుర్తింపు మండలి(న్యాక్) గ్రేడ్ ఉండేది. ఆ తరవాత మొత్తం 133 ప్రభుత్వ డిగ్రీ కళాశాలల్లో 93 ఈ గుర్తింపు సాధించాయి. దేశంలోనే మొదటిసారిగా ప్రభుత్వ కాలేజీల్లో న్యాక్ 'ఏ++' గ్రేడ్ సాధించిన కళాశాల ఖమ్మంలో ఉంది. హైదరాబాద్ బేగంపేటలోని ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల కూడా ఈ గుర్తింపు సాధించింది. యువ జనాభాలో కళాశాలలో చేరుతున్నవారి నిష్పత్తి విషయంలో జాతీయ సగటు కంటే తెలంగాణ ఎంతో ముందుంది. 2020-21లో దేశవ్యాప్త స్థూల నమోదు నిష్పత్తి(జీఈఆర్) 27.3శాతం. తెలంగాణలో అది 39.1శాతం. జాతీయ స్థాయిలో మహిళల జీఈఆర్ 27.9శాతం. రాష్ట్రంలో అది 40.9శాతం! దళిత, గిరిజన మహిళల విషయంలోనూ కొత్త రాష్ట్రం ఇదే స్థాయిలో ముందుండటం విశేషం. 2023-24 విద్యా సంవత్సరానికి సంబంధించి రాష్ట్రంలోని విశ్వవిద్యాలయాలు వివిధ కోర్సుల నిమిత్తం ప్రవేశ పరీక్షలు నిర్వహించాయి. తొలిదశ కౌన్సెలింగ్ ద్వారా మొత్తం 22,599 మంది విద్యార్థులు సీట్లు సాధించారు. అయితే, వారిలో 16,496 మంది (సుమారు 73శాతం) అమ్మాయిలే! రాష్ట్రంలో మహిళల విద్యాసాధికారతకు బలంగా అడుగులు పడ్డాయనేందుకు ఇదే ఉదాహరణ.

రాష్ట్ర ప్రభుత్వం పాఠ్యాంశాల రూపకల్పన, ప్రవేశాలు మొదలుకొని మూల్యాంకనం వరకు నూతన విధానాలను ప్రవేశపెట్టింది. ప్రవేశ ప్రక్రియను సులభతరంచేస్తూ తీసుకొచ్చిన ఆధునిక సాంకేతిక విధానం(దోస్త్) గ్రామీణ విద్యార్థులకూ సౌలభ్యంగా ఉంటోంది. అభివృద్ధి చెందిన దేశాలకు తీసిపోనివిధంగా రాష్ట్రంలో నాణ్యమైన విద్యతో పాటు నైపుణ్యాభివృద్ధికి పెద్దపీట వేయడంతో ఎంతో మంది విద్యార్థులకు 'చదువుతూ సంపాదన(ఎర్న్ వైల్ లెర్న్)' అంది వచ్చింది. ఆంగ్ల మాధ్యమంలో చదువుతున్న గురుకుల విద్యార్థులు, ముఖ్యంగా అమ్మాయిలు పెద్ద సంఖ్యలో విదేశీ విశ్వవిద్యాలయాల్లో ప్రవేశాలు పొందుతున్నారు. 'మహిళలు సాధించిన ప్రగతిని బట్టి నేను సమాజ పురోగతిని కొలుస్తాను' అన్నారు డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్. ఆ స్ఫూర్తితోనే తెలంగాణ ప్రభుత్వం మహిళల సంక్షేమం, అభివృద్ధి కోసం అనేక కార్యక్రమాలను తీసుకొచ్చింది. ఒకప్పుడు గ్రామీణ ప్రాంతాలకు చెందిన పేద విద్యార్థినులు ఐఐటీ, ట్రిపుల్ ఐటీ, ఇంజినీరింగ్, వైద్య విద్య కోర్సులను అభ్యసించడం చాలా కష్టంగా ఉండేది. ఇవాళ వారికి ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ గురుకుల సంస్థల ఆధ్వర్యాన నెలకొల్పిన ప్రతిభా కళాశాలల ద్వారా ఆయా కోర్సుల్లో ప్రవేశాలకు ఉచితంగా శిక్షణ ఇస్తున్నారు. శిక్షణ తీసుకున్న వారిలో అమ్మాయిలే ఎక్కువగా సీట్లు సాధిస్తున్నారు.

## తగ్గిన బాల్య వివాహాలు...

పేద కుటుంబాల్లో ఆడపిల్లకు పెళ్ళి చేయడమంటే తల్లిదండ్రులకు తలకు మించిన భారంగా ఉండేది. ఇటువంటి వారి కోసం రాష్ట్ర ప్రభుత్వం కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాలను తీసుకొచ్చింది. వీటివల్ల రాష్ట్రంలో బాల్య వివాహాలు గణనీయంగా తగ్గాయి. రుసుము చెల్లింపు (ఫీజు రీఇంబర్స్‌మెంట్) పథకంవల్ల ఎంతోమంది పేదింటి అమ్మాయిలు ఉన్నతవిద్యను అభ్యసిస్తున్నారు. వ్యవసాయ రంగానికి ప్రభుత్వం అనేక విధాలుగా తోడ్పాటు అందిస్తుండటంతో గ్రామీణుల ఆదాయం పెరిగింది. దాంతో చాలామంది తమ బిడ్డలను చదివించుకుంటున్నారు. ప్రభుత్వం ప్రవేశపెట్టిన పలు పథకాలు, కార్యక్రమాల తోడ్పాటుతో తెలంగాణ రాష్ట్రం విద్య, మహిళా సాధికారత వంటి విషయాల్లో మరింత ముందుకు వెళ్ళగలుగుతుంది.

– ఆచార్య ఆర్.లింబాద్రి
(తెలంగాణ రాష్ట్ర ఉన్నత విద్యామండలి ఛైర్మన్)

Date : 12/10/2023 EditionName : GREATER HYDERABAD PageNo : 04